# దళిత ఉద్యమనేత, ప్రముఖ ప్రజాతంత్రవాది బొజ్జాతారకంగారికి జోహార్లు



**రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ) జాతీయ అధ్యక్షులు, దళిత ఉద్యమనేత, ప్రముఖ న్యాయవాది, పీడిత ప్రజా ఉద్యమ పక్షపాతి, ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు శ్రీ బొజ్జాతారకం (78సం॥లు) 16-9-16న హైద్రాబాద్‌లో మృతిచెందారు. శ్రీ బొజ్జాతారకం మృతిపట్ల రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ, వారికి జోహార్లర్పిస్తోంది.**

బొజ్జాతారకంగారు ఇటీవలి కాలంలో అనారోగ్యంతో బాధపడుతూ కూడా పీడిత, దళిత ప్రజా ఉద్యమాలకు వెన్నంటి నిలిచారు. 12-6-12న శ్రీకాకుళంజిల్లా లక్షింపేట దళితులపై జరిగిన హత్యాకాండను ఖండిస్తూ బాధితులపక్షాన, వారి డిమాండ్ల పరిష్కారం కోసం ఒకవైపున న్యాయపోరాటం చేస్తూనే, రాష్ట్ర వ్యాపితంగా లక్షింపేట దళితుల పోరాటానికి సంఘీభావోద్యమాన్ని నిర్మించటానికి నాయకత్వం వహించారు. 'లక్షింపేట దళిత పోరాట సంఘీభావకమిటి' కన్వీనర్‌గా రైతుకూలీసంఘంతో సహా రాష్ట్రంలోని వివిధ దళిత, ప్రజాసంఘాలను ఒక వేదికపైకి తెచ్చి సుదీర్ఘకాలం సాగించిన ఆందోళన ఫలితంగా కేసు విచారణ కోసం లక్షింపేటలో ప్రత్యేక కోర్టునేర్పరిచారు. లక్షింపేట దళితుల భూమి సమస్య పరిష్కారం కోసం ఆయన చివరివరకూ పరితపించారు.

చుండూరు మారణకాండ కేసులో క్రింది కోర్టులో శిక్షలు విధించబడినవారందరినీ నిర్దోషులుగా పరిగణిస్తూ 22-4-14న హైకోర్టు తీర్పునిచ్చిన నేపధ్యంలో బొజ్జాతారకంగారు మరో పర్యాయం తీవ్రంగా స్పందించారు. 'చుండూరు దళితుల న్యాయపోరాట కమిటీ' నేర్పాటుచేయటంలో ముఖ్యపాత్ర వహించటంతో పాటుగా 'జడ్జీల నియామకం - వారి జవాబుదారీతనం'పై దేశవ్యాపిత చర్చ జరిగే విధంగా కార్యక్రమాలకు నేతృత్వం వహించారు.

1939 జూన్ 27న తూర్పుగోదావరి జిల్లాలో నాటి అమలాపురం తాలూకాలోని బొజ్జావారిపేటలో బొజ్జా అప్పలస్వామి, మావుళ్ళమ్మ దంపతులకు తారకంగారు జన్మించారు. బొజ్జా అప్పలస్వామిగారు 1952 ఎన్నికల్లో ముమ్మిడివరం నుండి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు.

బొజ్జాతారకంగారు అత్యవసరపరిస్థితి కాలంలో అరెస్టయ్యారు. దళిత సమస్యలపై నిరంతర పోరాటాలు సాగిస్తూ వచ్చారు. పౌరహక్కుల ఉద్యమంలో క్రియాశీలపాత్ర నిర్వహించారు. ఆయన రచించిన 'పోలీసులు అరెస్టు చేస్తే' పుస్తకం ప్రజాతంత్రవాదులకు, పౌరహక్కుల కార్యకర్తలకు విశేషంగా ఉపయోగపడింది. బొజ్జా తారకంగారు 'పంచతంత్రం' వంటి నవలలు, పలు రచనలు చేశారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా న్యాయస్థానాలు వేదికగా పోరాటం చేశారు. కాకినాడ సెజ్ బాధితుల పక్షాన నిలిచారు. కోస్తా కారిడార్‌కు వ్యతిరేకంగా బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ విస్తృత ఐక్యకార్యాచరణ సాగించారు.

బొజ్జా తారకంగారి నాయకత్వంలోని ఐక్య కార్యాచరణ కార్యక్రమాలలో రైతుకూలీసంఘం (ఆంధ్రప్రదేశ్) చురుకైన భాగస్వామిగా ఉంటూ వస్తోంది. దళితుల, ఆదివాసుల ఆత్మగౌరవ సమస్యను, భూమి సమస్యను ఆయన నొక్కి చెప్పేవారు. విజయనగరంజిల్లా దుగ్గేరు గిరిజనోద్యమానికి సంఘీభావంగా నిలిచిన బొజ్జా తారకంగారికి ఆ ప్రాంత గిరిజన ప్రజానీకం ఎదురేగి తమ సాంప్రదాయ నృత్యాలతో ఆహ్వానం పలికి తోడ్కొని వెళ్ళటం మరపురానిది. బొజ్జాతారకంగారి మృతి పీడిత, దళిత, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు.

బొజ్జా తారకంగారి కుటుంబసభ్యులకు, ఆర్‌పిఐ శ్రేణులకు రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) తన తీవ్ర సంతాపాన్ని, సానుభూతినీ తెలియబరుస్తోంది. బొజ్జాతారకంగారికి జోహార్లర్పిస్తోంది.

**విజయవాడ,**
**17-9-16**

**యస్. ఝాన్సీ, అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)**

# సీనియర్ కమ్యూనిస్టు

# కామ్రేడ్ సురభి అమరలింగంకు జోహార్లు

---

**సీనియర్** కమ్యూనిస్టు కామ్రేడ్ సురభి అమరలింగం (76 సం॥లు) 21-9-16న అనారోగ్యంతో గుంటూరుజిల్లా, రెంటచింతల గ్రామంలో మరణించారు. పాతగురజాల తాలూకా మిట్టగుడిపాడు గ్రామంలో 1940 సం॥రంలో జన్మించిన కా॥ అమరలింగం బ్రతుకుతెరువు కోసం రెంటచింతల గ్రామం వచ్చి, సన్నాయిమేళం, క్షురకవృత్తి చేసుకుంటూ కమ్యూనిస్టుపార్టీ పరిచయంలోకి వచ్చారు. ఆ క్రమంలో పార్టీ సభ్యత్వం స్వీకరించారు. ఆ ప్రాంతంలో దళితులు, గిరిజనులు, పేద, బలహీనవర్గాలు సాగించే ఆందోళనల్లో, రైతాంగ సమస్యలపై తీసుకున్న కార్యక్రమాలన్నింటా కామ్రేడ్ అమరలింగం చురుగ్గా పాల్గొంటూ వచ్చారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) సంబంధాలలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాంతంలో చేపట్టిన పేదల ఇళ్ళ స్థలాల సమస్యపై కార్యక్రమంలోనూ, మన్యం భూముల సమస్యపై కార్యక్రమంలోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారు. వివిధ సందర్భాలలో పెత్తందారుల దాడులు, దౌర్జన్యాలు సాగించిన సందర్భంలో, పోలీసులు అక్రమ కేసులతో కార్యకర్తలను వేధింపులకు గురిచేసిన సందర్భాలలో సీనియర్ కామ్రేడ్‌గా సంఘానికి గొప్ప అండగా నిలిచారు. కా॥ అమరలింగం మృతి రెంటచింతల ప్రాంత ఉద్యమానికి తీరనిలోటు. కామ్రేడ్ అమరలింగానికి సిపిఐ(ఎం-ఎల్) గుంటూరుజిల్లా కమిటి జోహార్లర్పిస్తున్నది. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తోంది.

కా॥ అమరలింగం మరణవార్త తెలిసినవెంటనే సంఘం కార్యకర్తలు, నాయకులు తరలివెళ్ళి నివాళులర్పించారు. రైతుకూలీసంఘం(ఆం.ప్ర) గుంటూరుజిల్లా కార్యదర్శి కా॥ పాటిబండ్ల కోటేశ్వరరావు, కా॥ అమరలింగం మృతదేహంపై ఎర్రజెండాను కప్పి జోహార్లర్పించారు. సంఘం జిల్లా నాయకులు కా॥ నీలాద్రి రాంబాబు, ఓపిడిఆర్ జిల్లా నాయకులు, న్యాయవాది శ్రీ శానంపూడి వెంకటేశ్వరరెడ్డి, ఎన్‌వైయస్ జిల్లా అధ్యక్షులు కా॥ కె. శ్రీను, సిపిఐ పల్నాడు ఏరియా కార్యదర్శి కా॥ షేక్ హుస్సేన్, సిపిఐ(ఎం) మండల కార్యదర్శి కా॥ తిక్కా నాగేశ్వరరావు, బిఎస్‌పి మండల కార్యదర్శి బాణావత్ శ్రీను నాయక్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కర్నాటి కోటయ్య ఇంకా వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు, కార్మికులు - కా॥ అమరలింగం భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. 21-9-16 సాయంత్రం పెద్దసంఖ్యలో ప్రజలు జోహార్లు చెప్తుండగా అంతిమయాత్ర, అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.

ooooo

# తొలితరం మహిళా ఉద్యమనేత

# కా॥ నాగళ్ళ రాజేశ్వరమ్మ మృతికి సంతాపం

---

**101** ఏళ్ళ క్రితం 1915లో కృష్ణాజిల్లా ఉయ్యూరు సమీపంలోని గరికపర్రు గ్రామంలో జన్మించిన నెక్కలపూడి రాజేశ్వరమ్మగారు 2016 సెప్టెంబరు 4న మరణించారు. ఆమె తన నిండు నూరేళ్ళపైగా జీవితంలో 75 సం॥ల పాటు మహిళాసంఘ నిర్మాణానికి, కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధికీ క్రియాశీలంగా పనిచేశారు. 1934లో కాటూరు గ్రామానికి చెందిన నాగళ్ళ జానకిరామయ్యను వివాహమాడిన రాజేశ్వరమ్మ బ్రిటీషు వ్యతిరేక స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తినీ, మూఢవిశ్వాసాలూ, సాంఘిక దురాచారాలకూ వ్యతిరేకంగా సాగిన హేతువాద సంస్కరణ భావాలనూ, నాటి ప్రపంచంలో ఏకైక సోషలిస్టు రాజ్యంగా భాసిల్లుతున్న సోవియట్ యూనియన్ ప్రభావాన్నీ, కమ్యూనిస్టు రాజకీయాలనూ పుణికి పుచ్చుకున్నారు. గురజాడ, కందుకూరి, గోర్కీల సాహిత్యంలోని సాంఘిక, రాజకీయ విప్లవ ప్రభావాలూ, గోపరాజు రామచంద్రరావు (గోరా) వ్యాప్తిచేసిన మూఢవిశ్వాసాల వ్యతిరేక ఉద్యమ ప్రత్యక్ష ప్రభావమూ రాజేశ్వరమ్మపై వుండేవి. శారదా చట్టం (1935)ను అమలుపరచి బాల్యవివాహాలను అరికట్టాలనీ, వితంతు, కులాంతర వివాహాలను ప్రోత్సహించాలనీ, స్త్రీలకు విద్య తప్పనిసరిగా నేర్పాలనీ, పితృస్వామిక వివక్షలు తొలగిపోవాలనీ, కల్లు - సారా తాగుడును అరికట్టాలనీ రాజేశ్వరమ్మ ఉద్యమస్థాయిలో కృషిచేశారు. మహిళలు పరదాచాటునే జీవించాలనే ఘోర దురాచారాలు అమలుజరుగుతున్న రోజుల్లో కాలినడకన, పొలంగట్లను దాటుకుంటూ ఊరూరు తిరిగి మహిళా ఉద్యమ నిర్మాణానికి అవిరళ కృషిసల్పారు. 1937-38 సంవత్సరాల్లో తూర్పు కృష్ణాజిల్లా మహిళాసంఘాన్ని నిర్మించటంలో కీలకపాత్ర వహించారు.

భూస్వామ్య – జమీందారీ వ్యతిరేక రైతాంగ ఉద్యమాన్నీ, వీర తెలంగాణా విప్లవ పోరాటానికందిస్తున్న దృఢమైన సంఘీభావాన్నీ సహించలేని కాంగ్రెసు పాలకులు, కోస్తా జిల్లాలలో క్రూర నిర్బంధ విధానాలకు పాల్పడ్డారు. పళనియప్పన్ లాంటి నరహంతక పోలీసు అధికార్లు గ్రామాలకు గ్రామాలను అణచివేతకు గురిచేశారు. కాటూరు – యలమర్రు గ్రామాలలో నడిబజారుల్లోకి ఈడ్చబడిన మగవారినందరినీ బహిరంగంగా దిగంబరులను కావించి గాంధీ విగ్రహం చుట్టూ తిప్పారు. ఆ రోజుల్లో రాజేశ్వరమ్మ కొంతకాలం రహస్య జీవితాన్ని, కొన్నాళ్ళు జైలు జీవితాన్నీ గడిపారు. తర్వాత కొంతకాలం ఆమె కాటూరు గ్రామానికి సర్పంచిగా పనిచేశారు.

1962–63లలో భారత–చైనా సరిహద్దు సంఘర్షణలను అడ్డుపెట్టుకుని భారత పాలకులు కమ్యూనిస్టు ఉద్యమాన్ని అణచివేయాలని పన్నిన కుట్రలో భాగంగా కమ్యూనిస్టుల్లోని విప్లవవర్గంపై నిర్బంధాన్ని ప్రయోగించినపుడు కా॥ రాజేశ్వరమ్మ ధైర్యంగా నిలిచి ఉద్యమశక్తులకు సహకరించారు.

1963–64ల్లో కమ్యూనిస్టుపార్టీ సిద్ధాంత, రాజకీయ విభేదాల వల్ల చీలిపోయినపుడు రాజేశ్వరమ్మ సి.పి.ఐ.(యం) పక్షాన నిలిచి విప్లవ దృక్పథాన్ని ప్రదర్శించారు. 'జనశక్తి' పత్రిక విస్తృతంగా ప్రజలలోకి వెళ్ళేందుకు కృషిసల్పారు. మరోసారి 1965–66ల్లో దేశవ్యాపితంగా సి.పి.యం. నాయకత్వాన్ని అరెస్టులు చేసి జైళ్ళపాల్జేసినపుడు కా॥ రాజేశ్వరమ్మ బహిరంగనాయకురాలిగా బాధ్యతలను నిర్వహించి కమ్యూనిస్టుపార్టీ ప్రతిష్టనూ, ఉద్యమ నిర్మాణాన్నీ కాపాడారు.

రాజేశ్వరమ్మ చదువుకున్నది కేవలం 5–6 తరగతులే అయినా ప్రజాఉద్యమమనే విశ్వవిద్యాలయంలో ఆమె అపార జ్ఞానాన్ని పొందారు. 1950 ప్రాంతంలో ఆంధ్రా విశ్వవిద్యాలయంలో మహిళా సమస్యలపై ఆమె చేసిన అనర్గళ ప్రసంగానికి, అందులోని ఆచార్యులే ఆశ్చర్యపడ్డారు. కష్టజీవుల రాజ్యంకోసం, 95 సంవత్సరాల వయసుదాకా అవిశ్రాంతంగా ఉద్యమ కార్యకలాపాలలో పాల్గొంటూ, నమ్మిన ఆశయాలను వీడకుండా, సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని గడిపిన నాగళ్ళ రాజేశ్వరమ్మగారి మరణానికి 'జనశక్తి' పత్రిక సంతాపం తెలుపుతూ నివాళులర్పిస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తోంది.



ooooo

# రైతుకూలీ సంఘం నాయకులు కామ్రేడ్ కర్రి మోషేకు జోహార్లు

**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)** గుంటూరుజిల్లా సీనియర్ నాయకులు కామ్రేడ్ కర్రి మోషే (95 సం॥లు) 21–9–16న నంబూరు గ్రామంలో కనుమూశారు. కా॥ మోషే మరణవార్త తెలిసిన వెంటనే పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతుకూలీసంఘం నాయకులు వెళ్ళి, మోషే మృతదేహం వద్ద జోహార్లర్పించారు. సిపిఐ(ఎం–ఎల్) కేంద్ర నాయకులు కా॥ జి. విజయకుమార్ కా॥ మోషే మృతదేహంపై ఎర్రజెండానుంచి జోహార్లర్పించారు.

దళిత, వ్యవసాయ కూలీ దంపతులైన కర్రి ఆనందరావు, మహాలక్ష్మమ్మల పదిమంది సంతానంలో కా॥ కర్రి మోషే మూడవవారు. వ్యవసాయకూలీగా జీవనం ప్రారంభించిన కా॥ మోషే గ్రామంలో కమ్యూనిస్టు శాఖ ఏర్పడి, కార్యక్రమాలు ప్రారంభమవటంతో పార్టీపట్ల ఆకర్షితులయ్యారు. నాడు కమ్యూనిస్టుపార్టీ నాయకులుగా వున్న కా॥ జొన్నల అంజిరెడ్డి పంచాయితీ సర్పంచిగా వుంటూ చెరువు భూమి పేదలకు కేటాయించి, వారందరిచే ఇళ్ళు వేయించారు. అగ్రకుల పెత్తందార్లను ఎదుర్కొని దళితులు ఈ భూమిని నిలబెట్టు కోవటంలో కా॥ మోషే, జొన్నల అంజిరెడ్డిగారికి చేదోడువాదోడుగా నిలిచారు. కులవ్యవస్థకు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పార్టీ చేపట్టిన కార్యక్రమాల అమలులో కా॥ మోషే చురుగ్గా పాల్గొన్నారు. పార్టీ కార్యక్రమాల ప్రభావాన్ని సహించలేని గ్రామ అగ్రకుల పెత్తందార్లు చెరువు భూమిలో నిర్మించిన పేదల ఇళ్ళను ప్రభుత్వ, పోలీసుల సహాయంతో దాడిచేసి కూల్చివేశారు. దీనికి వ్యతిరేకంగా పార్టీ ఆధ్వర్యాన పోరాటంలో కా॥ మోషే పాల్గొన్నారు. 1964లో హెచ్చుకూలీ రేట్లకోసం వ్యవసాయకూలీలు సాగించిన సమ్మెలో కా॥ మోషే క్రియాశీలంగా పాల్గొన్నారు. పరిసర గ్రామాల కూలీలందరినీ కూడగట్టిన సంఘీభావంగా నిలిచి హెచ్చుకూలీరేట్లను సాధించుకున్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) గుంటూరుజిల్లా ఉపాధ్యక్షునిగా కా॥ మోషే బాధ్యతల్లో వున్నారు. రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో అమరుడు కా॥ విశ్వమోహనరెడ్డి నాయకత్వంలో కొండమోడు వద్ద పేదలు నిర్మించుకున్న కాలనీని ఫారెస్టు అధికారులు కూల్చివేసి, ప్రధాన నాయకత్వాన్నంతా అరెస్టుచేసి భయోత్పాతం సృష్టించిన సందర్భంలో 1997 ఫిబ్రవరిలో – పార్టీ, సంఘ సీనియర్ కామ్రేడ్స్‌తో కలిసి ఆ ప్రాంతంలో నిలబడి కాలనీవాసులకు మనోధైర్యం కల్పించి, తిరిగి ఇళ్ళను పునర్నిర్మించుకునే కృషిలో పట్టుదలగా కా॥ మోషే పాల్గొన్నారు. వృద్ధాప్యం, అనారోగ్యంతో వున్నప్పటికీ కదలికలలో వున్నంతకాలం సంఘం కార్యక్రమాలలో పాల్గొంటూ వచ్చారు. కా॥ మోషే భార్య, కుటుంబసభ్యులు పార్టీ కార్యకర్తలకు సహాయంగా నిలిచారు.

కా॥ మోషే మృతిపట్ల రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా కమిటీ నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర సంతాపాన్ని తెలియబరుస్తోంది.

ooooo